క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



పుస్తకాలు అందజేస్తున్న ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవీంద్రప్రసాద్

కొండపి: ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన, మెరుగైన విద్య అందుతుందని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని కె.ఉప్పలపాడు మహిళా జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో మొదటి సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ ఇంగ్లిష్ మీడియం అడ్మిషన్లు జరుగుతాయన్నాని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంస్థ సభ్యులు

పామూరు: వేసవిదృష్ట్యా మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని సింగిల్‌విండో పామూరు, సీఎస్‌పురం మాజీ చైర్మన్‌లు బోయళ్ల నారాయణరెడ్డి, బైరెడ్డి జయరామిరెడ్డి అన్నారు. స్థానిక కందుకూరురోడ్డులో మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సంస్థ మండల చైర్మన్ కల్లూరిరామిరెడ్డి, అధ్యక్షుడు యం.ముసలయ్యలతో కలిసి వారు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ గద్దే యేదుకొండలు, ఎన్.బాబూరావు, వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, మితికాల నారాయణ, బీఎస్.రంగారెడ్డి, పి.తిరుపతిరెడ్డి, వై.వెంకటసుబ్బయ్య, కేవీ కృష్ణారెడ్డి, గడ్డం నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు వాహనాలకు జరిమానా

పీసీపల్లి: పరిమితికి మించి లోడు ఎక్కువ వేయరాదని దర్శి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ అన్నారు. మండల పరిధిలోని ఓవర్ లోడ్ వేసుకొని వెళ్తున్న మూడు వాహనాలకు జరిమానా విధించి వారితో మాట్లాడారు. అతివేగం ప్రాణాంకమని, జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూఇచంచారు. 18 ఏళ్ల లోపు వారు ఎటువంటి వెహికల్ వాహనాలు నడపడానికి వీల్లేదని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్సు లేకుండా, హెల్మెట్ లేకుండా రోడ్లపై తిరిగినా జరిమానా విధిస్తామన్నారు.

రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

హనుమంతునిపాడు: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలకు ఈ నెల 11 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఎం రంగ సుబ్బరాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ బ్యాంక్ సీతారాంపురం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిమ్మారెడ్డిపల్లి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ వేములపాడు, ఇండియన్ బ్యాంక్ గుడిపాటిపల్లి పరిధిలో అర్హులైన ఎస్సీ వర్గానికి చెందిన లబ్ధిదారులు ఈ నెల 11 నుంచి 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లతో ఆన్‌లైన్ దరకాస్తులు చేసుకోవాలని కోరారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

లింగసముద్రం: ఉపాధి హామీలో చేపట్టిన పనులపై అధికారులు సామాజిక తనిఖీ నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు అధ్యక్షతన డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని, ఇతర అధికారుల సమక్షంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో గతేడాది ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జరిగిన ఉపాధిహామీ పథకానికి సంబంధించి రూ.11.50 కోట్లు పనుల గురించి సోషల్ ఆడిట్‌ను నిర్వహించారు. సామాజిక తనిఖీ అధికారులు గత నెల 18 నుంచి 31వ తేదీవరకు గ్రామాల్లో జరిగిన పనుల గురించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్పీలు గ్రామాల్లో జరిగిన పనులపై చదివి వినిపించారు. లింగసముద్రంలో రూ.1,15,691లతో మొక్కలు వేయగా ఒక్క మొక్క కూడా బతకలేదని తేలిందని వాటిని తిరిగి నాటాలని పీడీ ఆదేశించారు. ఇందుకుగాను రూ.65,700 జరిమానా విధించారు. మండలంలో అన్ని పంచాయతీల్లో జరిగిన అవకతవకలపై సిబ్బంది నుంచి రూ.1,18,450 రికవరీ చేయాలని అధికారులను పీడీ గంగాభవాని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఏపీడీ బాబూరావు, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్‌బాబు, ఎస్ఆర్పీ బుజ్జి, ఏపీఓలు సమీర్‌బాషా, అబ్దుల్లా, డీఆర్పీలు, టీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెకు ప్రయాణం.. ప్రమాదభరితం

- ఛిద్రంగా గ్రామీణ రోడ్లు..
- నిత్యకృత్యంగా ప్రమాదాలు..
- కనీస మరమ్మతులు పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కనిగిరిరూరల్:

సంక్రాంతి తర్వాత రాష్ట్రంలో గుంతలు లేని రహదారులు చూపిస్తాం.. రోడ్లన్నీ అద్దాల్లా మెరిపిస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన కూటమి ప్రభుత్వం చేతల్లో మాత్రం ఘోరంగా విఫలమైంది. అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటినా గ్రామీణ రోడ్లన్నీ అధ్వానంగానే ఉన్నాయి. కనీస మరమ్మతులు చేయకపోవడంతో రోడ్లు మరింత ఛిద్రంగా తయారయ్యాయి. రహదారుల ఛిద్రంతో ఈ రోడ్లలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. దీంతో పల్లె ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గ్రామీణ లింకు రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. కొన్ని ప్రధాన రహదారులు కూడా గోతుల మయంగా దర్శనమిస్తున్నాయి. దీంతో నిత్యం ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులుగా మారుతున్నారు.

మండలం: కనిగిరి, హెచ్ఎంపాడు గ్రామాలు: అర్బన్ కాలనీ, శ్రీరంగాపురం, హెచ్ఎంపాడు



గుంతలమయంగా కనిగిరి నుంచి హెచ్ఎంపాడు రోడ్డు దుస్థితి

ఇదిగో ఈ రహదారి... కనిగిరి టు అర్బన్‌కాలనీ, హెచ్ఎం పాడు వయా కంభం. కనిగిరి నుంచి హెచ్ఎంపాడు మండలానికి వెళ్లేందుకు కేవలం 12 కిలోమీటర్లు. ఎంత ఆలస్యంగా వెళ్లిగా 30 నిముషాల్లో చేరవచ్చు. ప్రస్తుతం రోడ్లన్నీ గోతులమయంగా మారడంతో ప్రయాణానికి చాలా ఇబ్బందులు తప్పడం లేదు. కనిగిరి మండలంలోని అర్బన్ కాలనీ, హెచ్ఎంపాడు సమీపంలో రోడ్లు గోతులమయంగా మారడంతో కన్నీటి ఘోష పెడుతున్నారు. ఇలాంటి రోడ్లు నియోజకవర్గంలో ఎన్నో ఉన్నాయి.

మండలం: కనిగిరి గ్రామం: యేరువారిపల్లి:



అజీస్‌పురం టు ఏరువారిపల్లి రోడ్డు దుస్థితి

మండలంలోని యేరువారిపల్లి గ్రామం నియోజకవర్గ కేంద్రానికి 9 కిలోమీటర్ల దూరం ఉంది. అజీస్ పురం నుంచి యేరువారిపల్లి గ్రామంలోకి వెళ్లే 2 కి.మీ లింకు దారి అధ్వాన్నంగా ఉంది. దీంతో ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఈ గ్రామంలో సుమారు 2 వేల జనానా ఉన్నారు. నిత్యం ప్రయాణం సాగించేటప్పుడు వారు పడే అవస్థలు వర్ణణాతీతం.

మండలం: పీసీపల్లి గ్రామాలు: బట్టుపల్లి, బుడ్డారెడ్డి పల్లి



ఏరువారిపల్లి టు బట్టుపల్లి, బుడ్డారెడ్డిపల్లి వయా పీసీపల్లి రోడ్డు దుస్థితి

ఈ గ్రామాలు పీసీపల్లి మండలం పరిధిలో ఉన్నాయి. అయితే నియోజకవర్గ కేంద్రమైన కనిగిరికి కేవలం 11 దూరంలోనే ఉన్నాయి. కనిగిరి నుంచి వయా బట్టుపల్లి, బుడ్డారెడ్డి పల్లి, మీదుగా పీసీపల్లి మండల కేంద్రానికి ఈ లింకు రోడ్డు ద్వారా 40 నిమిషాల్లో చేరవచ్చు. ఈ రోడ్డులో ఉన్న రెండు లింకు రోడ్డులు అధ్వాన్నంగా ఉన్నాయి. ఒకటి పూర్తిగా మట్టి రోడ్డు కాగా.. మరో రోడ్డు అడుగు అడుగునా గుంతలమయంగా మారి వాహదారులను నరకం చూపిస్తోంది.

పెంచిన ధరలు ఉపసంహరించుకోవాలి



పామూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు



సీఎస్‌పురంలో నిరసన తెలపుతున్న నేతలు

పామూరు: పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని సీపీఎం మండల కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా అన్నారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను నిరసిస్తూ మంగళవారం స్థానిక సుందరయ్య భవన్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో టీడీపీ నేతృత్వర్యంలో కూటమి ప్రభుత్వం పేదలసంక్షేమాన్ని గాలికి వదిలాయని, దీంతో నిత్యావసరవస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. ధరల పెంపుతో పేదలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, పెంపుపై పునరాలోచించి ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారన్నారు. సీపీఎం జిల్లా నాయకులు కొమ్మలపాటి మాల్యాద్రి, ఎం.విటలరావు, సయ్యద్‌గౌస్‌బాషా, షేక్.ఇస్మాయిల్, శ్రీను, సుబాని, చల్లా వెంకటేశ్వర్లు, షేక్.నాయబ్, ఎం.రామయ్య, షేక్.మస్తాన్ పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): గ్యాస్ సిలెండర్ ధరల పెంపును ఉపసంహరించుకోకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని సీపీఎం మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, జిల్లా నాయకుడు ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. గ్యాస్‌ధరల పెంపును నిరసిస్తూ మంగళవారం స్థానిక సీఎస్ పురం బస్టాండ్‌సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, మళ్లీ గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను పెంచడం హేయమన్నారు. ఎస్.తిరుపతిరెడ్డి, గుర్రం లక్ష్మయ్య, పాదిలి నరసింహులు, జిలకర వెంకటనారాయణ, సూరిపోగు రమేష్, బత్తుల వెంకటయ్య, పోలా తిరుపతమ్మ పలువురు పాల్గొన్నారు.

వెలిగండ్ల,(కనిగిరిరూరల్): పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు రాయళ్ల మాలకొండయ్య మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తొంగలో తొక్కుతుందన్నారు.

క్రీడలతో ఐకమత్యం పెంపు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు

- ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్థాయి క్రికెట్ విజేత శీలంవారిపల్లె

సీఎస్‌పురం(పామూరు): క్రీడలు ఐక్యతను పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని కనిగిరి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు కదిరి బాబూరావు అన్నారు. మండలంలోని శీలంవారిపల్లెలో శ్రీరామ నవమి పండుగ సందర్భంగా ప్రకాశం, నెల్లూరు జిల్లాల స్థాయిలో నిర్వహించిన ఆర్‌సీసీ 22వ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు మంగళవారంతో ముగియగా శీలంవారిపల్లెకు చెందిన లక్కీలెవన్ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి బహుమతుల ప్రదానోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ఆ దిశగా తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలన్నారు. టోర్నీలో విజేతగా నిలిచిన శీలంవారిపల్లెకు చెందిన లక్కీలెవన్ జట్టుకు కదిరి ప్రకాష్‌రావు బ్రదర్స్ రూ.50,116, ద్వితీయ స్థానంలో నిలిచిన సీఎస్‌పురంకు చెందిన చింటూ ఫాంథర్స్‌కు మునగల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రూ.30,116, తృతీయ స్థానంలో నిలిచిన శీలంవారిపల్లెకు చెందిన ఎస్ఎస్ఎంబీ జట్టుకు రూ.20,116 కదిరి రత్నంశివ, నాల్గవ స్థానంలో నిలిచిన ఉదయగిరి జట్టుకు రూ.10,116లను ఇరగని చలపతిరావు, మ్యాన్‌ఆఫ్‌దిమ్యాచ్ రూ.3,116 షేక్.ఖాజావలిలు సమకూర్చగా వాటిని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావుతో కలిసి విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో కదిరి ప్రకాశరావు, కదిరి పార్థసారది, రత్నం, నరసింహారావు, టి.బాబూరావు, యం.నారాయణ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మూరం కాశిరెడ్డి, శీలం మాధవరెడ్డి, పి.హరినారాయణ, నాయబ్‌రసూల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

11 లోగా దరఖాస్తు చేసుకోవాలి

మర్రిపూడి: మండలంలోని రావిళ్లవారిపాలెం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతులతో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 11 తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ నాగమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కస్తూర్బా పాఠశాలల్లో బాలికలకు ఉచిత విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. ఈ ఏడాది నుంచి నూతనంగా ఇంటర్ మొదటి సంవత్సర బైపీసీ గ్రూపును ప్రవేశపెట్టామన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న చైర్మన్‌అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: పట్టణంలో నీటి ఎద్దడి నివారణకు తక్షణ ప్రణాళిక సిద్ధం చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ డానియేల్ జోసఫ్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మున్సిపల్, సచివాలయ సిబ్బంది సమష్టిగా పనిచేసి నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి.. పట్టణంలోని అన్ని వార్డుల్లో తిరిగి నివేదిక తయారు చేయాలన్నారు. నీటి సమస్య తలెత్తకుంగా వేసవి కాలంలో వార్డుల్లో ఎటువంటి సమస్య రాకుండా పైప్‌లైన్ లీకేటి, బోర్లు, వాటర్ లైన్, ట్యాంకర్లతో నీటి సరఫరా తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. మున్సిపల్ ఏఈలు కోటేశ్వరరావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సృజన



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సృజన

పొన్నలూరు: ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా పని చేసి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సృజన అన్నారు. పొన్నలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పీహెచ్‌సీ డాక్టర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని గర్భిణులకు అవగాహన కల్పించి పీహెచ్‌సీలో కాన్పులు అయ్యేలా చూడాలన్నారు. పీహెచ్‌సీలో గణనీయంగా కాన్పుల సంఖ్య పెరగాలని, లేకపోతే ఆరోగ్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా పల్లెల్లో క్యాన్సర్ సర్వేను సక్రమంగా చేపట్టి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతి నెల క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేపట్టి అవసరమైన మందులు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా సమయపాలన పాటించి పీహెచ్‌సీలో ఓపీల సంఖ్య పెంచాలన్నారు.

మార్కెట్‌కు అనుగుణంగా బేళ్లను తీసుకురావాలి



వేలాన్ని పరిశీలిస్తున్న బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ

కొండపి: మార్కెట్‌కు అనుగుణంగా రైతులు వేలానికి బేళ్లను తీసుకురావాలని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విశ్వశ్రీ అన్నారు. స్థానిక వేలం కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ బేళ్లు కట్టేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వేలంలో మంచి ధర పొందవచ్చన్నారు. రైతులు సాగు ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది రైతులు బోర్డు సూచించిన మేరకే సాగు చేయాలన్నారు. వ్యాపారులు కూడా బేళ్లు నో బిడ్ వేయకుండా కొనుగోలు చేయాలన్నారు. వ్యాపారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ రైతులు పండించిన పొగాకు మొత్తం మంచి సరాసరి ధరతో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, సెక్రటరీ ఇన్‌చార్జి దివి వేణుగోపాల్, రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు, ఐటీసీ లీఫ్ మేనేజర్ శివకుమార్, ప్రవీణ్, వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

375 బేళ్లు కొనుగోలు

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన వేలంలో 375 బేళ్లు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌మార్ తెలిపారు. గుర్రప్పడియ, కె.అగ్రహారం, మూగచింతల, నెన్నూరుపాడు, చతుకుపాడు గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 547 బేళ్లను తీసుకురాగా అందులో 375 బేళ్లను కొనుగోలు చేసి 172 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.240, సరాసరి రూ.262.78 పలికింది. వేలంలో 13 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



మర్రిపూడిలో రామాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరణ



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

మర్రిపూడి: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మర్రిపూడి పడమటి బజారులోని కోదండ రామస్వామి ఆలయంలో సీతాసమేత శ్రీరాముల కళ్యాణాన్ని మంగళవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కోట్రా లక్ష్మణ్ణారాయణశర్మ ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గంధ్రకోట శ్రీనివాసశర్మ, లక్ష్మణ నారాయణ శర్మలు వేదమంత్రోచ్చరణతో కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఇనుకొల్లు వెంకటరామిరెడ్డి, మౌనిక దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

అంబేడ్కర్‌కు ఘనంగా నివాళి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకల్లో భాగంగా జరుగుతున్న అంబేడ్కర్ నివాళి కార్యక్రమంలో మంగళవారం మాల ఉద్యోగులు, మాలమహానాడు ఆధ్వర్యంలో ఘనంగా నివాళ్లర్పించారు. ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగాన్ని రచించడమే కాకుండా, అన్ని వర్గాల ప్రజలకు అవకాశాలు కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. దేశ భవిష్యత్ కోసం అంబడ్కర్ ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఈ నెల 14న అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అంబేడ్కర్‌కు నివాళి అర్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నేటి యువత ఆయన ఆశయాలకు అనుగుణంగా నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లింగాబత్తిన బ్రహ్మయ్య, దమ్ము థామస్, గేరా చిరంజీవి, పాలేటి కోటేశ్వరరావు, దారా మాధవరావు, బడుగు నరశింహం, మద్దాల రామారావు, మద్దులూరి రమణయ్య, లింగాబత్తిన బాలాజీ, బొట్లగుంట శ్రీనివాసులు, మెండెం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.